కథానిక

# ఏకాంతంలో....

'సుధ'

ఏకాంతం ఒక్కటే ఈ నా జీవిత అసంతృప్తికి శరణ్యమని విశ్వాసం కుదిరింది. ఈ కల్లోలిత నగర వాతావరణం, నిత్యసాంసారిక జీవితం వదలి—ఎలాగో లాగ—చాలా రాత్రివరకూ, ఎవరో కాని కనబడని, మూల బెంచీ మీద కూర్చోడం అలవాటు చేసుకున్నాను.

రాత్రి పదకొండు గంటలు——చీకటి జడ విరబోసుకుని వికటాట్టహాసం చేస్తోంది. మామూలు బెంచీ మీదే పడుకుని ఉన్నాను. కళ్లూ మనసూ తెరచే వున్నా రెండూ మాత్రం ఒకచోట లేవు. కళ్లకు కనపడనివి ఎన్నో చూస్తుంది, మనసు! పొగతో మేఘాలు తయారుచేసి ఆకాశంలోని మేఘాలకు జతపరుస్తూ చీకటిని మరింత పెచ్చగొడుతున్నాను.

నా ఏడుపు ఎవ్వరూ విని బాధపడ కూడదనే నా ఏకాంతం! ఆ ఉగ్రభీకరజీమూత సాంద్రఘోషలో నా రోదన నాకే వినిపించదు. ఆ ఘోషను శ్రుతిగా చేసుకుని నా మనసు శోకగానంచేస్తూ తన్మయతనొందింది. ఆకాశంలా పరిమితి లేని మనసు—నక్షత్రాల్లా లెక్కలేని ఆశలు! ఆకాశంలో మినుకు మినుకు లాడే ప్రతి నక్షత్రం, మనసులోని ఒకో ఆశకు చేయూతనిచ్చి లేవనెత్తుంది. సముద్రం, ఆకాశం కలిసేచోటుకి దృష్టిదగ్గరయే కొలదీ నక్షత్రాలు క్రిందకు దిగిపోతున్నాయి! అనంత మహాసముద్రంలోంచి ఆకాశం అంటుదామని బయలుదేరిన కెరటాలు నిరాశతో నుగి, ముక్కలై ఘోషిస్తున్నాయి! నా జీవిత సాగరంలోని ఆశాతరంగాలకు అధఃపతనం?...నక్షత్రాలు-కెరటాలు! ఆశ—నిరాశ!... నేను నిరాశావాదినా? —— ఎంతమాత్రం కాదని నాకు తెలుసు. అయితే, ఆశావాదానికి తగిన వాతావరణ సృష్టికి నిరోధకాలైన ఆర్థిక, సాంఘిక, రాజకీయ సంక్షోభమే, ఆశానిరాశల నిరంతర చాంచల్యమే—ఒకోసారి—నేను నిరాశావాదిననే సందేహానికి తావిస్తే ఈయనూవచ్చు.

' చీకటి! పొడుగాటి చీకటిముద్ద! అటూయిటూ తిరుగాడుతుంది!...ఏకాంతం!' చిత్తచాంచల్యపు భ్రమచేతనేమో? అనుకుని, ఒకటుడు నలచి పెట్టడానికి నిప్పుచేస్తున్నాను.

" పారేయకండి—పారేయకండి "— త్రుళ్లిపడి, తిరిగి చూచాను. చాచిన చెయి! తెలియకుండానే నిప్పుపెట్టె, చేతిలో ఉంచాను. ఆ చెయ్యిమరోచేతి సహాయంతో నిప్పుచేసి చుట్ట నంటించింది. ఇంక భయంలేదు—నా లాంటి మనిషే. నిప్పుపెట్టె నాచేతిలోనే వుంది. ఎవరు?...ఎవరైతే నాకేం?—— అయితే, అతనలా అనుకుంటేనా? నేనెవర్నయినా అతనికి కావాలని నాకేం తెలుసు! తూర్పు రంగంలో పొగతో మేఘాలు కల్పిస్తున్నాను. వెనుకనుంచి మేఘాలు వచ్చి, వాటితో చేరి. రెండూ కలిసి ప్రయాణం చేస్తున్నాయి. తిరిగి చూచాను. నేను పడుకోగా మిగిలినచోటు అతనిది. అటువైపు ముఖం పెట్టి, పొగ వదులుతున్నాడు.

'ఎవరు?' నామనసు ఊరుకోదలచలేదు.

'ఎవరు?' అని మనసూ అంతేననుకుంటూ. రెండు ప్రశ్నార్థకాలు. రెండు జతల కళ్లూ దాగుడు మూతలు. నేను చూస్తున్నట్టు అతనికి తెలియకూడదు...దొంగ పట్టు బట్టాడు——రెండు జతల కళ్లూ కలుసుకున్నాయి.

" ఎవరు బాబూ...? " నా గొంతు ఊడబట్టలేకపోయింది.

"క్షమించండి- మీరు...?" నన్నింకా విశ్వసించని ధ్వని గ్రహించాను. నేనెవర్నో తెలుసుకుని తనకేమీ అపకారంచెయ్యననే నమ్మకం కుదిరితేనే గాని, తానెవరో తెలుసుకోలేను.

"ఎవరో... ఇలా, ఒక్కరూ..." ఎంతో బరువుగా మాట్లాడుతున్నాడు. వెనుకనుండి 'తళుక్' మని మెరుపులా——

"ఇప్పుడే వస్తా..." చటుక్కున లేచి, ఆకాంతి వచ్చినవేపు పోతున్నాడు:

'ఎవరతను!... ఆ గొంతు ఎప్పుడో, ఎక్కడో పరిచితమైనట్టే తోస్తుంది, అతను మాట్లాడుతున్నంత సేపూ. ఇంత రాత్రివేళ- నేనే అనుకుంటే- ఈ సముద్రపు ఒడ్డుకి ఎందుకు వచ్చివుంటాడు? ...ఎవరై ఉంటాడు? పెద్దింటికి చెందినట్టు తోస్తుంది...!' నా మనసుకు మరో ఆలోచన లేదు. ఆ గొంతు పరిచితమైనదిగానే తోస్తూంది. కాని మనసు ఆ వ్యక్తిని స్థిరపరచుకోలేని సందిగ్ధంలోనే కొట్టుకుంటూంది!

ఇంతలో- మరో మనిషి టార్చిలైటులో దారి చూపుతూంటే- తిన్నగా నా బల్లదగ్గరకే వచ్చాడు మళ్లీ. లైటు. అతని రెండో చేతిలోనివేవో (ధ్వనిని బట్టి సీసాలనుకుంటున్నా) బల్లమీదుంచేసి చకచకా పోయాడు, కొత్తగా వచ్చిన మనిషి: నవుకరు అయివుంటాడు. ఇప్పుడు కాంతిలో నడచి రావడంలో స్వరూపంకూడా చూడగల్గేను. ఇంతలో తను బల్లమీదున్న వాటిమీద వేసిన లైటు, అతనెవరో తెలియని చీకటిలో క్షోభించుకుంటున్న నా మనసుకు కూడ కాంతినిచ్చింది. అతణ్ణే గుర్తు పట్టేను- నా కళ్లను నమ్మలేకుండా వున్నాను!

అతని గురించి నాలో స్థిరమై ఉన్న కొన్ని నిశ్చితాభిప్రాయాలను ఈ దృశ్యం కదిలించింది. ముఖ్యంగా ఈ విషయంలోనే నాకు అనేక మందితో భేదాభిప్రాయం- అతను ఈ బ్రాందీ లాంటి మత్తుపదార్థాలు వాడడనే నేను ఇంత వరకూ నమ్ముతూవచ్చాను.

అతను నా ఆలోచనని ఆక్రమించుకోడానికి కారణం, అతని చేతలూ భావాలూ గురించి నేను అభిప్రాయాలు ఏర్పరచుకోడమే. నిజానికి నాకు అతనితో పరిచయం లేదనే చెప్పాలి- ఏదో పని మీద వెళ్లి ఒకటి రెండుసార్లు మాట్లాడేనంతే. తరువాత అతనిగూర్చిన ప్రజాభిప్రాయాలు, అతను చేసే ప్రజోపయోగ కార్యాలు, పాల్గొనే ప్రజా సంస్థలు, ఉపన్యాసాలు, వ్యక్తపరచే భావాలు, మొదలైనవి అన్నీ నాకు పరిచయంచేసి నాలో కొన్ని అభిప్రాయాలను ఏర్పరచినాయి.

అతడి గురించి సంఘంలో రెండు విరుద్ధ భావాలున్నాయి. అతనిని మహాత్యాగిగా స్వార్థరహితునిగా భావించి, 'దేవుడిలాంటివాడు- ప్రజల కోసం ప్రాణమైనా సరే ధారపోస్తాడు- మానవులలో ఉత్తమోత్తముడు' అనే వారొక తెగ. అతను చెప్పే మాటలు, చేసే కార్యాలు, అంతా స్వార్థంతో కూడినవిగానూ; అతని వినయం, కలుపుగోలుతనం, అంతా నటనగానూ భావించి, అదంతా బూర్జువాతత్వపు బూటకమనీ- అతను గోముఖవ్యాఘ్రమనీ- ఈ కార్యాలన్నీ ప్రజలను తనవశం చేసుకుని వారిచేత పొగడబడుతూ కీర్తి గడించుకోవాలనే ఉద్దేశ్యంతోనే అనీ- అతని దగ్గర చేరి, అతని బలపర్చే విజ్ఞానులూ పెద్దలూ కూడ అతని ధనానికి దాసులైనవాళ్లే అనీ అనే వాళ్లు రెండో తెగ. చాలమంది అతనొక తాగుబోతూ, జారుడూ అనికూడా అంటారు.

నా అభిప్రాయాలు ఈ రెండురకాలకూ వ్యతిరేకం. అతడు తన జీవితాన్ని చక్కగా అర్థం చేసుకుని, ఒక ఉత్తమపంథాలో జీవితం నిర్మించుకున్న వ్యక్తి, నా అభిప్రాయంలో. కీర్తి గడించుకోవాలనే సహజమైన దౌర్బల్యం ఉండనూ ఉండవచ్చును. కాని, తను చేసే ప్రతి కార్యమూ అందుకేనని నేననుకోలేను. స్వార్థపరుడు కానిగాని; ఇతరులకోసం ప్రాణమునైనా ధారపోసే త్యాగి, దేవుడిలాంటివాడనిగాని నేననుకోలేను. తన సౌఖ్యం, క్షేమం చూసుకుంటూ ఇతరులకు చేయగలిగిన సహాయం చేస్తాడు అని ఆశయంగా భావించుకున్నాను. ముఖ్యంగా, మనిషి పొందే ఆనందానికి. సుఖానికి ఎక్కువ సహాయపడడానికి పూనుకుంటాడు. తను ధనవంతుడు అయినంతమాత్రాన అతడంతా ధనికస్వభావం గలవాడిగా నేను భావించలేను. తను ధనికుడు కావచ్చు- కాని, ధనాశ వున్నట్టు రుజువు చేయగల సంఘటన ఒకటీ లేదని చెప్పొచ్చు- తన ధనానికి ఇంకా ధనం చేరుద్దామనే తలపే లేదతనికి. విజ్ఞానులు, వివేకులు, అతనికంటె గొప్పవారు, కళారాధకులు కూడ అతనితో కలసి మెలసి తిరుగుతారంటే అతని సుస్వభావం, మంచి అలవాట్లు. అతనిలోని స్వారస్యం, నైర్మల్యమే, అతని ఆదరాభిమానాలే కారణం.

నేను ఆ సీసాలకేసీ తనముఖంకేసీ చూస్తున్న ఆశ్చర్యం పసికట్టేవుంటాడు.

"క్షమించండి-మీ ఏకాంతానికి అడ్డువచ్చానను కుంటా. అయితే ఇక్కడికి రావడం తప్పలేదు. ఈ సీసా చూసి నన్ను మరోలా భావించరనే నమ్ముతాను- తాగుబోతును కాను, నేను. నా దౌర్బల్యం

దీన్ని అవసరంగా చేసుకుందంటే...... ఈ రోజు నే చనిపోయినరోజు! నాలుగేళ్లనుండీ ప్రతి సంవత్సరం ఈనాడుయీ బెంచీదగ్గరకి వస్తున్నాను."

నాకేమీ అర్థంకాక ఉక్కిరి బిక్కిరి అవుతున్నాను. చనిపోయినరోజు! పిచ్చెత్తిందేమో?

సీసాలోది గ్లాసులో పోసి మూడు గుటకలలో మింగేశాడు-"అమ్మా..." అంటూ, నాకు ఎదంగా చతికిలబడ్డాడు. అంతా అగమ్యగోచరంగా ఉంది- ఏదో భయంలాంటిది నాలో బయలుదేరింది.

"క్షమించి, ఏమీ అనుకోకపోతే..." అంటూ ఆ బెంచిమీదే, నావేపు తలపెట్టి పడుకున్నాడు, 'భగవాన్!' అంటూ. నేను జరుగుదామనుకున్నా జరగలేక పోయాను. కళ్లు రెప్ప పడకుండా అతన్నే చూస్తున్నాయి.

"మీరెవరో...నేనింకా గుర్తించుకోలేక పోయాను—అయితే నాకదంతా అవసరంకూడా కాదు. ఈ సమయంలో, యిక్కడ యీ స్థితిలో ఉన్న మిమ్మల్ని అర్థంచేసుకోగలను. నేను. నాల్గు సంవత్సరాల హృదయభారం మోయలేక బాధపడే నాకు ...ఈ రోజు న వి ము క్తి ...లేకపోతే, సముద్రంతో చెప్పుకోవలసి వచ్చి ఉండునేమో! ఎన్ని సంవత్సరాలు కన్నీరైతే సముద్రానికి అర్థమవుతుంది! తన ఘోషలో అసలు నేను వినిపిస్తేనా?...

నాల్గు సంవత్సరాల క్రితం:

ఈ రోజునే, నేనే తనుగా భావించే నాభార్య పోయినరోజు—ఆ రోజే నేను చనిపోయినట్టు భావించుకున్నా..."

మాటల్లో, లోనుంచి ఉబికివచ్చే బాధ వ్యక్తమవుతూంది.

"ప్రపంచంలో మహాభాగ్య మనుకునేవన్నీ లేక పోలేదు. కాని నాభాగ్య నాకు అంతకన్నా ఎక్కువ! మహాభాగ్యం! అమాయకపు కళ్లూ, చిరునవ్వు ముఖం, నిర్మల హృదయం...ఆవిడలోని శాంత సహనాలు, మరపురాని సంభాషణలు......తనని గురించి ఏమి చెప్పబోయినా ఉన్నదానికి తక్కువే అయితీరుతుంది.

"పుట్టుకతో ధనిక కుటుంబీకురాలు కాకపోవడంచేత మొదట్లో ఎలా నడుచుకోవాలో తెలియకపోయినా, నాదగ్గరకు వచ్చిన కొన్ని నెలలకే అన్నీ తెలుసుకుంది. గొప్ప యింటపడడం తన అదృష్టమనుకునేదో, నేను భర్త కావడం తన కోర్కెలు ఫలించినట్టు భావించుకునేదో, ఎప్పుడూ మురిసిపోతూ, జీవితం ఆనందమయం చేసుకున్నట్టుండేది-...

"పెళ్లికాక ముందటి నా చెడు అలవాట్లన్నీ ఒక్క సంవత్సరంలో రూపు మాపింది! మా తల్లిదండ్రులుకూడ ఒక దేవతలా చూచుకున్నారు-- నన్నెంతో తీర్చి దిద్దిందని. ఎక్కడికిపోయి ఏ రాత్రివచ్చినా కనిపెట్టుకుని ఉండేది. నాకోసం భోజనం చేయకుండా ఉంటున్నావంటే 'ఆకలి లేదు--మిమ్మల్ని తలుచుకుంటేనే నాకు నిండుగా వుంటుంది. అందులో, మీరు వస్తారని ఎదురు కాచుకోడంలో నాకు ఆకలే వుండదు...' అంటూ, ఏదో చెప్పేది-ఎంత కోపంతో వచ్చి మాట్లాడినా నవ్వుతూ, నన్ను చల్లార్చేసేది! చివరకు నాకు జాలివేసి నన్ను నేనే మార్చుకునేటంత శాంతంగా ...మధురంగా...పాపం! ఎన్ని అబద్ధాలు చెప్పేవాడిని! నేనంటే ఎందుకో అంత నమ్మకం!...నా తిరుగుళ్ళగురించీ, అలవాట్లగురించి, అంతకుముందు అనేకవిధాలుగా చెప్పుకునే వారందరినీ-వాళ్ళకు వాళ్లే-సిగ్గుపడి, నమ్మలేనంతగా...వాళ్ళ మాటల తీరుని మార్చగలిగింది!...ఒక సంవత్సరం చదువు అలవాటుచేసుకుని ఎన్నో మంచి పుస్తకాలు చదివి, అనేక జీవితాలకు అర్థం చెప్పేది.

"నాకు తెలుసు, నేను వట్టి మోసంలో బతుకుతున్నానని. నాదగ్గర కొచ్చేవాళ్ళలో నేనంటే కిట్టనివాళ్లే ఎక్కువ. వీలుచిక్కితే నొక్కి వేయడానికీ, నా స్థానాపచయానికీ ప్రయత్నానికే వస్తారు. అయితే, వాళ్ళతోనే-ఎంతో ఇష్టంగా, ఆప్యాయంగా మాట్లాడగల్గుతాను. అమాయకులు-పాపం, పైవాళ్ళకు నాకు నిజంగా స్నే హి తు లె వ రో తెలీదు!...పెద్దలూ, పండితులూ, విద్యావంతులూ, వాళ్లూ వీళ్లూ వచ్చేరంటే నామీది ప్రేమ విశ్వాసాలతో కాదనీ, నా ఉద్యోగపు హోదాలోని అధికారపు ఆశ్రయంకోసమనీ, ధ నా శ తో న నీ తెలుసు. అలానే యిష్టం లేనివాళ్ళతో మరీ యిష్టంగావున్నట్టు నటిస్తూ మొత్తంమీద అనేక దిక్కులనుంచి అందరినీ కాచుకుంటూ, ఎంతో మోసంగా గడుపుతున్నా. లోపలి నావుద్దేశ్యాలూ, ఆశయాలూ ఎలావున్నా, లౌకికంగా ఇంత మోసం ఉంటేనేగాని జీవితంకాదు! ఇలాంటప్పు డెప్పుడైనా అలాంటి నా జీవితాన్ని తలుచుకునే ఏడు

స్తాను-ఏదో కొంతబరువు తగ్గినట్టవుతుంది. ఎప్పుడూ కుతకుతలాడే ఈకుళ్లు, మోసం మధ్య కొట్టుకుంటూ ఎప్పు డేంచేయాలో అనే ఏదో ఆలోచనే...... దీనికితోడు నేను మళ్లీ పెళ్లిచేసుకోవడం...పిల్లలు ఛీ!... అన్నీ మర్చిపోయి, ఒక్కరోజైనా, నా దివ్యజ్యోతి నన్ను విడిచిన (సంవత్సరానికీ) ఈ ఒక్కరోజైనా, ఆవిణ్ణి స్మరించుకుంటూ, నా మోసపు బ్రతుకు క్షమించమనీ, బాధపడవద్దనీ, ప్రార్థించుకుందామని...... ఈ నాలుగేళ్లనుంచీ ఇలానే వస్తూంటా— అన్నీ మర్చిపోడానికి. నా దౌర్బల్యం ఈ మత్తుసీసాని అవసరంగా చేసుకుంది ఈ ఒక్కరోజే... పాపం, ఎంత బాధతో ఉందో ఏమో— కడసారి కనుమూసేముందుకూడ చిరునవ్వు తోనే నాతో 'మీరు బాధపడకూడదు తెలుసా! హాయిగా వుండాలి!...' అంటూ, 'మీ యిష్టం వచ్చినట్టూ... కాని, ఈ చిట్టితల్లినిమాత్రం, నే నుంటే చూచుకున్నట్టే చూచుకోవాలి–' అంటూ కళ్లుమూసుకుంది.

"వాళ్లకేగో ముంచుకుపోయినట్టూ, నే నలా బ్రతకడమే సంఘ రథానికి అడ్డువచ్చినట్టూ...ఒక రేమిటి, తల్లిదండ్రుల దగ్గరనుంచి ప్రతివారూ, మతి పోగొట్టేశారు. నాకు మళ్లీ పెళ్లి, పిల్లలు. పాపం ఈమె కూడా నన్నెంతో నమ్మినట్టే తోస్తూంది. తెలివైనది కావడంవల్ల నిజవిషయాలు కొన్ని తెలిసినా, తెలియనట్టేవుండి, మొత్తానికి నాకు బాధ కలిగేలా సంచరించకుండా వుండాలనే ప్రయత్నిస్తుంది. కాని ఈ పిల్లలా... నా చిట్టీ... నా దివ్యజ్యోతి వప్పజెప్పిన నా చిట్టితల్లి... పాపం ఆవిడుంటే ఎంతబాగా, ఎలా చూసుకుని తయారు చేసుకునేదో... నే నేం చేస్తున్నాను, నా చిట్టికి!"

అంతకంతకూ స్వరం హీనమైపోతూంది. ఒకో మాట వినిపించడమే లేదు.

"హా! భగవాన్ అంటూ పక్కకు ఒత్తిగిలేడు.

"చిట్టీ... మీ అమ్ముంటే— ఎలాచూచేదో!... మోసగాణ్ణి... నిన్నూ మోసంచేస్తున్నా—నో... ఏమో!... అమ్మా!..."

ప్రకృతంతా నిశ్చలంగా- నిశ్శబ్దంగా- విచారంగా... ఎంతరాత్రయిందో ఏమో!

* * *

ఇంతసేపూ అతని బాధా జీవితంలో కరిగి కన్నీరైన నాకు మళ్లీ ఏకాంతం, అలము ఆకున్న విషాదమధ్యాన! ఆ విషాదం, నా జీవితపు దుఃఖ సంఘటనలలో ప్రతిబింబిస్తూంది! నా జీవిత దుఃఖమంతా ఒకేచోట పోగు పడిపోతున్నది!

పోయిన నా భార్య- చిట్టిబాబు! ...పాడైన ఆర్థికపరిస్థితి- నా చిట్టిబాబుని పెంచే దాది... నన్నుగురించిన అపవాదులు- పెళ్లిబలవంతాలు- చక్కబడిన ఆర్థికపరిస్థితిలో చిట్టిబాబును తయారు చేసే నా ఆదర్శం- మళ్లీ పెళ్లిళ్ల గోల... దుష్ప్రచారాలు-! హా! హా!... కుతకుత లాడే కుళ్లుకంటెకూడ...

ఏదో ఏడుపుగా వినిపించింది- నా చిట్టిబాబు కళ్లలో ఉన్నాడు- గతం ఏదో వచ్చి నా మెదడును తాకింది- "మీ రేం చేసినా... నా చిట్టిబాబునుమట్టుకు ఎలా చూసుకుంటారో"! పోయిన చిట్టిబాబుతల్లి- నా జీవితం!...

చిట్టిబాబు ఏడుస్తున్నాడేమో!

ఇక నృటికాలం ఉండలేకపోయాను.

---


## ది ఇండియన్ బ్యాంక్ లిమిటెడ్

హెడ్డాఫీసు : మదరాసు

(Estd :  1907)

జారీచేసి చందావేయబడిన

| | |
|---|---|
| మూలధనం | రూ. 72,00,000 |
| అడిగిన మూలధనము. | రూ. 53,00,000 |
| రిజర్వ్ ఫండ్ | రూ. 62,00,000 |

అన్నిరకాల బ్యాంకింగ్ వ్యవహారాలు చేయబడును.

యస్. గోపాల అయ్యర్,
కార్యదర్శి.